
# ప్రజా బంధువు సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- బీఆర్ఎస్‌లో చేరిన పొరండ్ల గ్రామ యువత
- కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: ప్రజా బంధువు సీఎం కేసీఆర్ అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై యువకులు పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తోట మహేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన 20 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రభాగాన నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా, వైద్యం, వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ పాలన చేపడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 33 మెడికల్ కళాశాలలు రాష్ట్రంలో మాత్రమే ఉన్నాయన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పడిగెల గంగారెడ్డి, గొల్లపల్లి చందు, లింగన్న, జగన్ పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కమలాకర్ రావు అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళాలు



ఆలయ నిర్మాణానికి విరాళాలు అందజేస్తున్న దాతలు

సారంగాపూర్, అక్టోబర్ 29: లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న దాసాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం గ్రామానికి చెందిన గడ్డం మహిపాల్ రెడ్డి రూ.51వేలు, భూక్యా రవినాయక్ రూ.25 వేలు ఆలయ నిర్మాణ కమిటీకి విరాళంగా అందజేశారు. అలాగే ఇందన్‌పల్లి పక్కీర్ రూ.18 వేలు, మానేరు హరీశ్ రూ.10 వేల విలువైన సామగ్రిని అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకరిస్తున్న దాతలను ఆలయ కమిటీ సభ్యులు, పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాంపర్తి రంజిత్, గురుస్వామి మానేరు గంగాధర్, గడ్డం మైపాల్ రెడ్డి, మేడిపెల్లి రఘుపతి రెడ్డి, బూతగడ్డ తిరుపతి, బూతగడ్డ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రాయికల్, అక్టోబర్ 29: పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని జగిత్యాల ఆర్డీవో నరసింహామూర్తి అన్నారు. కుమ్మరిపల్లి మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో ఆదివారం పరిశీలించారు. అనంతరం బోర్నపల్లి చెక్‌పోస్ట్‌ను ఆర్డీవో తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. అయన వెంట తహసీల్దార్ ఖయ్యూం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు, రేపు పోలింగ్ సిబ్బందికి శిక్షణ

### కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్‌లో పాల్గొనే సిబ్బందికి సోమ, మంగళవారాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని కోరుట్ల, జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల, ధర్మపురిలోని ఎస్టీ బాలుర వసతి గృహంలో, కోరుట్లలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఎన్నికల విధులకు నియమించిన ఉద్యోగులు శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని కలెక్టర్ తెలిపారు.

## రూ.70 వేల నగదు పట్టివేత

సారంగాపూర్, అక్టోబర్ 29: కోనాపూర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి ఎస్ఐ తిరుపతి ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించారు. పెంబట్ల గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్ అనే వ్యక్తి రూ.70 వేలు ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తుండడంతో పట్టుకొని జగిత్యాల గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించినట్లు ఎస్ఐ తిరుపతి పేర్కొన్నారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, ఏదైనా వస్తువులు తీసుకెళ్తుంటే దానికి సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కమ్మునూర్‌లో

సారంగాపూర్, అక్టోబర్ 29: బీర్‌పూర్ మండలంలోని కమ్మునూర్ శివారులోని ప్రధాన రహదారి వద్ద ఎస్ఐ గౌతమ్ పవార్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ప్రధాన రహదారి గుండా వెళ్తున్న వాహనాలను ఆపి ధ్రువపత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారు, బైక్ ఢీకొని నలుగురికి గాయాలు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 29: జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట గ్రామ శివారులో ఆదివారం జరిగిన కారు, బైక్ ఢీకొట్టిన ఘటనలో నలుగురికి గాయాలయ్యారు. బైక్‌పై సాయిరెడ్డి, నరేశ్ రెడ్డి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు తిప్పన్నపేట శివారులో అదుపు తప్పి బైక్‌ను ఢీకొని చెట్టుకు ఢీకొంది. బైక్‌పై వెళ్తున్న సాయిరెడ్డి, నరేశ్ రెడ్డి, కారులో ఉన్న సందీప్, రమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి.

## రవీంద్రభారతిలో కళాకారుల నృత్య ప్రదర్శన

రాయికల్, అక్టోబర్ 29: భారతి ఆర్ట్స్ అకాడమీ ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం మాస్టర్ 94వ జయంతి సందర్భంగా సిరిసిరి మువ్వలు-4 సాంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనలను హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఆదివారం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో రాయికల్ మండలానికి చెందిన బొమ్మకంటి అంజన్న శ్రీ, బండి రసజ్ఞ కూచిపూడి నృత్యం చేసి ప్రశంసపత్రాలతో పాటు జ్ఞాపికలు అందుకున్నారు.

# భారీ మెజార్టీతో గెలిపించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ■ పట్టణంలో 5వ వార్డులో ప్రచారం



పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 29: జగిత్యాల మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డుకు వచ్చిన ఎమ్మెల్యే దంపతులకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకకర్తలు, వార్డు ప్రజలు స్వాగతం పలికారు. వార్డులో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, వార్డు ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కోరారు.

### వంద మంది బీఆర్ఎస్‌లో చేరిక

ఎన్నికల ప్రచారంలో 5వ వార్డుకు వచ్చిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సమక్షంలో గోవింద్‌పల్లె బైపాస్ రోడ్డుకు చెందిన వంద మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గోవింద్‌పల్లి బైపాస్‌కు చెందిన ఉప్పరి అక్షయ్, అతడి మిత్రులు కలిసి పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. ఇక్కడ పలువురు నాయకులున్నారు.



బీడీ కార్మికురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే

## అత్యల్ప ఓటర్లు ఉన్న గ్రామం..
## చిన్న కొల్వాయి

సారంగాపూర్, అక్టోబర్ 29: జిల్లాలోనే అత్యల్ప ఓటర్లు ఉన్న గ్రామంగా చిన్న కొల్వాయి గిరిజన గ్రామం నిలిచింది. బీర్‌పూర్ మండలంలో 15 గ్రామాలు ఉండగా ఇందులో గిరిజన గ్రామమైన చిన్న కొల్వాయిలో అత్యల్పంగా 105 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో 45 మంది పురుషులు ఉండగా, 60 మంది మహిళలు ఉన్నారు.



చిన్న కొల్వాయి గ్రామం

## గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలి



నూతన కార్యవర్గం

రాయికల్, అక్టోబర్ 29: గౌడ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గోపా అధ్యక్షుడు దుర్గపు రవీందర్ గౌడ్ అన్నారు. రాయికల్ పట్టణంలో ఆదివారం గోపా (గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్) మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బత్తిని నిరంజన్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా పోతుగంటి సురేశ్ గౌడ్, కోశాధికారిగా గుగ్గిల్ల రాము, ఉపాధ్యక్షులుగా ఎనుగందుల శ్రీనివాస్ గౌడ్, కైరం రమణ, కార్య నిర్వాహణ కార్యదర్శిగా కైరం సత్తయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శిగా పెగ్గర్ల నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా కొత్తకొండ నందయ్య, మోసారపు సంతోష్, సుధవేని నాగరాజు, దోసారపు రాజేందర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారి దుర్గపు శ్రీనివాస్ గౌడ్, పరిశీలకులు తిరుమల, సదాశివ, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ గౌడ్, బత్తిని సత్యనారాయణ గౌడ్, జిల్లా నాయకులు అంబటి రాజయ్య, దుర్గపు శ్రీనివాస్ గౌడ్, పొన్నం రమేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఓబులాపూర్‌లో మద్యం పట్టివేత

మల్లాపూర్, అక్టోబర్ 29: ఓబులాపూర్ గ్రామంలో అక్రమంగా ఓ ఇంట్లో మద్యం నిల్వ ఉందనే సమాచారంతో స్థానిక ఎస్ఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు రూ.33 వేల విలువైన 71 లీటర్ల మద్యం పట్టుకొని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



పట్టుబడ్డ మద్యంతో ఎస్ఐ నవీన్‌కుమార్